జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఖమ్మం
ఆదివారం | 1 | ఫిబ్రవరి | 2026 ◆ పేజీలు : 5

## ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సన్మానించిన పోలీస్ కమిషనర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** శనివారం ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు,శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాధ్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖకు ఎనలేని సేవలందించారారని పోలీస్ కమీషనర్ కొనియాడారు.విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు.పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.

## హస్నాబాద్ లో ప్రజా పనులు పక్కనపెట్టి ప్రైవేట్ పనులకే మల్టీపర్పస్ వర్కర్లు..!



**తిరుమలాయపాలెం జనవరి 31 (ప్రజా జ్యోతి ):** తిరుమలాయపాలెం మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో గ్రామ సెక్రటరీ నిర్వాకం ప్రజల ఆగ్రహానికి కారణమవుతోంది. విధి నిర్వహణలో ఉండాల్సిన మల్టీపర్పస్ వర్కర్లను గ్రామ పారిశుధ్య పనులకు వినియోగించకుండా ప్రైవేట్ పనులకు పంపిస్తూ కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బజార్లు శుభ్రం చేయించాలని, సైడ్ కాలువలు క్లీన్ చేయించాలని, చెత్త ఎక్కించాలని గ్రామ ప్రజలు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా సెక్రటరీ స్పందించకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ప్రజా అవసరాలు పక్కనపెట్టి సొంత పనులకే మల్టీపర్పస్ వర్కర్లను వాడుకోవడం అధికార దుర్వినియోగానికి

మిగతా 2 లో...



## ప్రభుత్వ ప్రాధాన్యత పనుల పూర్తిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

- ప్రాధాన్యత పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి :** స్థానిక ప్రభుత్వ ప్రాధాన్యత పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి,త్వరితగతిన పూర్తికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో అధికారులతో దళిత బంధు, మెప్మా, సోలార్ పవర్ ప్లాంట్స్, టూరిజం, భూసేకరణ,ఇందిరా మహిళా డైరీ, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్, అక్షయపాత్ర, ప్రభుత్వ కళాశాలల పై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టే పనులు వ్యక్తిగత శ్రద్ధతో త్వరితగతిన పూర్తికి చర్యలు చేపట్టాలన్నారు. దళిత బంధు యూనిట్ల పెండింగ్ విడుదల పూర్తి చేయాలన్నారు. డైవర్ట్ అయిన యూనిట్ల విషయంలో చర్యలు వేగవంతం చేయాలన్నారు. మధిర నియోజకవర్గంలో మెప్మా కార్యకలాపాలు చేపట్టాలన్నారు. క్రొత్తగా 200 పట్టణ స్వయం సహాయక సంఘాలను ఏర్పాటుకు, 2000 మంది క్రొత్త సభ్యులను చేర్చుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. మధిర లో శిక్షణా కేంద్రం ఏర్పాటుకు స్థలం

మిగతా 2 లో...

## హస్నాబాద్ లో హరితహారం మాయమైంది!

- నర్సరీలో కనిపించని మొక్కలు.. అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం.




**తిరుమలాయపాలెం జనవరి 31 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చుచేసి అమలు చేస్తున్న హరితహారం కార్యక్రమం పూర్తిగా దెబ్బతిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన హరితహారం నర్సరీలో సంవత్సర కాలంగా ఒక్క మొక్క కూడా లేకపోవడం పాలన వైఫల్యాన్ని స్పష్టంగా చూపిస్తోంది.మొక్కలు పెంచాల్సిన నర్సరీ నేడు బీడువారిన మైదానంగా మారింది. నీరు లేదు, సంరక్షణ లేదు

మిగతా 2 లో...

## వైరా పురపాలకలో 13 వార్డ్ మైనార్టీలకు ఇవ్వాల్సిందే..

- కాంగ్రెస్ టికెట్ అడిగిన అన్వర్ - ఎమ్మెల్యే సానుకూలత



**ఖమ్మం వైరా, జనవరి 31 ప్రజాజ్యోతి :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 13 వార్డు మైనార్టీలకు కేటాయించాలని, పోటీ చేయడానికి తనకు అవకాశం కల్పించాలని షేక్ అన్వర్ శనివారం వైరాలో ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ క్యాంప్ కార్యాలయం వద్ద కలుసుకొని టిక్కెట్ ఇవ్వలని అడిగారు. అన్వర్ మైనారిటీ పెద్దలతో వార్డులో ఉన్న యువకులతో భారీగా చేరుకొని టిక్కెట్ విషయమై చర్చించారు. గతంలో కాంగ్రెస్ టికెట్ పైన పోటీ చేశానని, అప్పటి అధికార

మిగతా 2 లో...

## వైరా పురపాలకలో 13 వార్డ్ మైనార్టీలకు ఇవ్వాల్సిందే..

(మొదటి పేజీ తరువాయి...)

బిఆర్ఎస్ పార్టీపై స్వల్ప తేడాతో ఓడిపోయానని గుర్తు చేశారు. ఓటమి చెందినప్పటికీ అధికారం లేకపోయినా, కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్నానని, వార్డులో ఎవరికి కష్టమొచ్చినా, తాను వెన్నంటి ఉన్నానని సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానని తెలిపారు. అధికారం ఎక్కడ ఉంటే అక్కడికి పార్టీలు మారే వాళ్లతో పార్టీకి నష్టమే గాని లాభం ఉండదని అన్నారు. అప్పటి టిఆర్ఎస్ అభ్యర్థి అయిన ముళ్ళపాటి సీతారాములుతో పోటీపడి స్వల్ప తేడాతో ఓడిపోయిన సంగతి తెలిసిందే, అయినప్పటికీ నిరాశ చెందకుండా కాంగ్రెస్ పార్టీలోనే ఉండి కష్ట కాలంలో కార్యకర్తగా వార్డులో కాంగ్రెస్ శ్రేణుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానన్నారు. ఈ క్రమంలో మారిన రాజకీయ పరిణామాల్లో ముళ్ళపాటి సీతారాములు బిఆర్ఎస్ వీడి కాంగ్రెస్ పార్టీలోకి శారడంతో 13వ వార్డు సీటు ఆసక్తిగా మారింది. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ ద్వారా ఇక్కడ సీటు కోసం సీతారాములు ల్యాబి నడుపుతున్నారు. సిట్టింగ్ సీటు తనకే వస్తుందని ఆయన ధీమాగా ఉన్నారు. మొదటి నుండి కాంగ్రెస్ కి మైనారిటీలు దండుగా ఉన్నారని, ఉమైనారిటీలు అంటే కాంగ్రెస్, అని మైనార్టీలకు13వ వార్డు కేటాయించాలని కోరుతున్నామని, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ షేక్ సొందు సాహెబ్ ఎమ్మెల్యేని కోరారు. అందుకు ఎమ్మెల్యే స్పందించి, కచ్చితంగా సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని న్యాయం చేసే విధంగా నా ప్రయత్నం ఉంటుందని అన్నారు. జిల్లా అధ్యక్షుడుతో మాట్లాడిన తర్వాత ఒక నిర్ణయానికి వస్తామని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో 13 వ వార్డు ముస్లింలకు కేటాయించాలని కుల సంఘ నాయకులు అక్కడికి వచ్చిన కాంగ్రెస్ నాయకులు, అన్వర్ కి మద్దతు ఇచ్చారు. అవకాశవాదంతో పార్టీలు మారే వాళ్ళకి టికెట్లు ఇస్తే పార్టీ నష్టపోతుందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు వాపోయారు. టికెట్ ఇస్తే భారీ మెజార్టీతో గెలిపించుకొని ఎమ్మెల్యేకి బహుమతిగా ఇస్తామని ముస్లిం పెద్దలు అన్నారు ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శీలం నర్సిరెడ్డి, 9వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి కట్ల సంతోష్, అతాఉల్లా, తదితరులు పాల్గొన్నారు

## హస్నాబాద్ లో ప్రజా పనులు పక్కన పెట్టి ప్రైవేట్ పనులకే మల్టీపర్పస్ వర్కర్లు..!

(మొదటి పేజీ తరువాయి...)

నిదర్శనమని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఫోన్లు చేసినా ఎత్తకపోవడం, సమయపాలన లేకుండా ఇష్టం వచ్చినప్పుడు కార్యాలయానికి రావడం—వెళ్లడం, గ్రామపంచాయతీ కార్యాలయానికి తరచూ తాళాలు వేసి ఉండటంతో సర్టిఫికెట్లు, ఇతర అవసరాల కోసం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుద్ధ్య లోపాలతో గ్రామం మొత్తం చెత్తకుప్పలుగా మారి దుర్వాసన, దోమల బెడదతో ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా సెక్రటరీ నిర్లక్ష్య ధోరణి మార్చుకోకపోవడం ప్రజల సహనానికి పరీక్షగా మారిందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తూ, లేని పక్షంలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ముట్టడి చేసి ఉద్యమ బాట పట్టక తప్పదని హెచ్చరిస్తున్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన సర్పంచి బాబురావు.



**కారేపల్లి, జనవరి 31, ప్రజా జ్యోతి:** సింగరేణి మండలం పాత కమలాపురం గ్రామపంచాయతీ లోని బోటి తండా గ్రామంలో ఉపాధి హామీ పనులను సర్పంచ్ తేజవత్ బాబురావు, ఉప సర్పంచ్ స్వాతి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతికూలికి ఉపాధి లభించేలా చర్యలు తీసుకుంటాము. రైతులకు ఉపయోగపడేలా పనులు చేపట్టాలని రైతు కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూలీలందరూ అధిక మొత్తంలో చెరువు పనిలో పాల్గొని ప్రభుత్వం కొలతల ప్రకారం పనిచేసినట్లైతే అధిక మొత్తంలో కూలి పొందుతారని గ్రామంలో కూలీలందరూ వంద రోజుల పని దినాలు వినియోగించుకోవాలని, అలాగే కూలి ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ ఏర్పాటు చేయాలని, ఫీల్డ్ అసిస్టెంట్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో తేజవా శ్రీనివాస్, కొర్ర నాగేశ్వరరావు, బాదావత్ లక్ష్మణ్, మాజీ ఉప సర్పంచ్ సపవట్ రమేష్, మీట్య కిరణ్,మంగ్యా,ఉపాధి హామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాధాన్యత పనుల పూర్తిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

(మొదటి పేజీ తరువాయి...)

గుర్తించాలని అన్నారు. బల్క్ గా యూనిట్ల తయారీకి ఏజన్సీ తో టై అప్ చేయాలన్నారు. వీక్లి కార్యాచరణ ప్రణాళిక చేయాలన్నారు.ఎర్రుపాలెం మండలం రాజుపాలెం,కల్లూరు మండలం చిన్న కోరుకోండిలలో ఏర్పాటుచేస్తున్న ఒక మెగా వాట్ సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. మహిళా దినోత్సవం మార్చి 8 లోపు పూర్తయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. ఖమ్మం లేక్ వ్యూ క్లబ్ పనులు వేగవంతం చేయాలన్నారు. జమలాపురం పర్యాటక అభివృద్ధి పనుల్లో చైన్ లింక్ ఫెన్సింగ్ పనులు జరుగుతున్నట్లు తెలిపారు.ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని,సెక్యూరిటీ క్యాబిన్, టికెట్ కౌంటర్, చిల్డ్రన్ ప్లే ఏరియా,అడ్వాంచర్ పార్క్ పనులు పూర్తి చేయాలన్నారు.బౌద్ధస్తూపం పనులు వేగవంతం చేయాలన్నారు. స్తూపం వద్ద పనులతోపాటు, పర్యాటకుల ఆకర్షణకు బాలసముద్రం చెరువులో బోటింగ్, బండ్ అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు.మెడిటేషన్ కేంద్రంతో బౌద్ధ స్థూపాన్ని చారిత్రక, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు.గుర్రాలపాడు అసంపూర్తి డబుల్ బెడ్ రూమ్ ల వద్ద కమర్షియల్ కాంప్లెక్స్, హెల్త్ సబ్ సెంటర్,చెల్డ్రెన్స్ పార్క్ ల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేయాలన్నారు.హరిత హోటల్ నిర్మాణానికి స్థల గుర్తింపు చేయాలన్నారు.రాయపట్నం హై లెవల్ బ్రిడ్జ్,మధిర ఓఆర్ఆర్ లకు స్థల సేకరణ పూర్తి చేయాలన్నారు.వైరా డంపింగ్ యార్డ్ కు కావాల్సిన స్థల సేకరణ పూర్తి చేయాలన్నారు.ఇందిరమ్మ మహిళా డెయిరీ ఏర్పాటుకు ఇంకనూ చేపట్టాల్సిన చర్యలను వేగం చేయాలన్నారు. పాల ధర ఎక్కువ వచ్చేలా హెరిటేజ్, మదర్, అమూల్ డెయిరీలను సంప్రదించాలన్నారు.మరో విడత గేదెల కొనుగోలు ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇజిఎస్ లో క్యాటిల్ షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అన్నారు.బిఎంసియు ల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. తెలంగాణ మాడల్ స్కూళ్ల నిర్మాణానికి చర్యలు వేగవంతం చేయాలన్నారు. స్కూళ్ల నమూనా,ఖర్చు వివరాలతో ప్రణాళిక చేయాలన్నారు. 12 స్కూళ్ల అభివృద్ధి లో భాగంగా స్కూళ్లలో స్థలం లభ్యత, చేపట్టాల్సిన సౌకర్యాలపై నివేదిక సమర్పించాలన్నారు. అక్షయపాత్ర ద్వారా హైజనిక్ ఫుడ్ అందుతుందని కలెక్టర్ అన్నారు. సెంట్రలైజ్ కిచెన్ ల ఏర్పాటుకు స్థల సేకరణ చేయాలన్నారు.మధిర డిగ్రీ కళాశాల, సిరిపురం ఐటిఐ ,సిరిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల, మధిర జూనియర్ కళాశాల,బనిగండ్లపాడు జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. కళాశాల ల మరమ్మతులకు మంజూరైన నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. వైరా, సత్తుపల్లి, పాలేరు, మధిర, ఖమ్మం నియోజకవర్గాల్లో మంజూరైన వీటిలో, వైరా, సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. మిగతా చోట పురోగతిలో ఉన్న పనుల్లో వేగం పెంచాలని,పూర్తయిన పనుల రికార్డులు నమోదుచేసి, బిల్లుల చెల్లింపుకు వెంట వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ అన్నారు. కెజిబివి స్కూళ్ల పెయింటింగ్ చేయాలన్నారు. ప్రాధాన్యత పనుల పూర్తికి అధికారులు పర్యవేక్షణ చేస్తూ, రోజువారీ పనుల పురోగతిని సమీక్షించాలన్నారు.ఈ సమావేశంలో ఎస్డీసి రాజేశ్వరి,ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు,డిఇఓ చైతన్య జైని, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాస చారి, ఇడి ఎస్సి కార్పొరేషన్ నవీన్ బాబు, జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తి, అటవీ అభివృద్ధి అధికారిణి మంజుల, డిఆర్డీవో శ్రీరామ్, హౌజింగ్ పిడి శ్రీనివాస్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవి బాబు, విద్యాశాఖ ఇఇ బుగ్గయ్య, పీఆర్ ఇఇ మహేష్ బాబు, ఐటిఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హస్నాబాద్ లో హరితహారం మాయమైంది!

(మొదటి పేజీ తరువాయి...)




పర్యవేక్షణ అసలే లేదు. హరితహారం పేరుతో వచ్చిన నిధులు ఎక్కడికి పోయాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది.గ్రామస్తులు మాత్రం పచ్చదనం కాగితాలకే పరిమితమైంది అని తీవ్రంగా మండిపడుతున్నారు.నర్సరీ నిర్వహణలో పంచాయతీ కార్యదర్శి పూర్తిగా చేతులెత్తేశారా అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్న నర్సరీని కనీసం చూసుకునే బాధ్యత కూడా లేకుండా, సంవత్సరం పాటు మొక్కలు లేకుండానే హరితహారం కొనసాగుతున్నట్టు రికార్డులు తయారు చేస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.గ్రామంలో చెట్లు నాటాల్సిన కాలంలో, మొక్కలే లేని నర్సరీ ఉండడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ఠగా గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. గ్రామ పర్యావరణాన్ని కాపాడాల్సిన కార్యక్రమం, అధికారుల నిర్లక్ష్యంతో సమాధి దశకు చేరిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి నర్సరీలో జరిగిన నిర్లక్ష్యంపై విచారణ చేపట్టాలని,హరితహారం నిధుల వినియోగంపై ఆడిట్ చేసిబాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలనిగ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## అచ్చన లాలయ్య ఆదర్శ కమ్యూనిస్టు - భాగం



**ఖమ్మం వైరా: జనవరి 31 ప్రజా జ్యోతి** అచ్చన లాలయ్య ఆదర్శ కమ్యూనిస్ట్ అని, నమ్మిన సిద్ధాంతం కోసం తుది వరకు నికార్స్ గా నిలబడ్డ నాయకుడని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. సీనియర్ నాయకులు అమరజీవి అచ్చన లాలయ్య జీవితం నిబద్ధత, నిజాయితీ, కలిగిన ఆదర్శ కమ్యూనిస్టు అని, హేమంతరావు కొనియాడారు. శనివారం పెద్దమునగల గ్రామంలో తలారి కృష్ణ అధ్యక్షతన జరిగిన లాలయ్య ఐదవ వర్ధంతి సభలో పాల్గొని మాట్లాడుతూ, కొనిజర్ల మండలంలో పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన ఉత్తమ కమ్యూనిస్టుగా ప్రజా పోరాటంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా వెనకడుగు వేయని ధైర్యశాలి అని ఆయన ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేశారు. ఈనెల 18న ఖమ్మంలో జరిగిన సిపిఐ వందేళ్ళ ఉత్సవాల బహిరంగ సభ కమ్యూనిస్టులు లేరని చెప్పుకునే వాళ్లకు సమాధానంగా నిలిచిందని అన్నారు. ఆ ఉత్సవాల స్ఫూర్తితో భవిష్యత్తులో కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ లాలయ్యతో సుదీర్ఘకాలం కలసి పనిచేసిన ఉద్యమ సంబంధం ఉన్నదని తెలిపారు. రైతు సంఘములో జిల్లా నాయకులుగా రైతుల సమస్యల కోసం పోరాటం చేసామని గుర్తు చేశారు. అమరుల ఆశయాలను సాధించటం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రా బాబు, తాటి వెంకటేశ్వర్లు, ఏపూరి లతా దేవి, పోటు కళావతి, మండల కార్యదర్శి గడల భాస్కరరావు, జిల్లా సమితి సభ్యులు పాపగంటి సుదర్శన్, మనీగ కోటేశ్వరరావు, పెద్ద మునగాల ఉప సర్పంచ్ సుంకర రాధాకృష్ణ, పిట్టల రాంబాబు, తలారి పాపయ్య, తుప్పతీ ముత్తయ్య, అచ్చన శ్రీను, ఏపూరి భాస్కరరావు, దాసరి వెంకయ్య పాల్గొన్నారు

## ప్రజా సమస్యల కోసం పోరాడిన వ్యక్తి కృష్ణారెడ్డి :: ఎమ్మెల్సీ తాత మధు.



**కారేపల్లి, జనవరి 31, ప్రజాజ్యోతి :** ప్రజా సమస్యల కోసం అను నిత్యం పోరాటం చేసిన గొప్ప నాయకుడు దాచేపల్లి కృష్ణారెడ్డి అకాల మరణం బాధాకరమని ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు సూదన్ అన్నారు. సింగరేణి మండల పరిధిలోని గాదేపాడు గ్రామంలో శనివారం దాచేపల్లి కృష్ణారెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఈ సభకు ఆయన హాజరై మాట్లాడుతూ ఈ ప్రాంత పరిసర గ్రామాల ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చినా నేనున్నా అంటూ పార్టీలకు అతీతంగా పేదల పక్షాన పెద్దదిక్కుగా వ్యవహరించే కృష్ణారెడ్డి గుండెపోటుతో మృతి చెందడం విచారకరమన్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే కృష్ణారెడ్డి మన మధ్యలో లేకపోవడం తీరని లోటన్నారు. అంతకుముందు దాచేపల్లి కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసిలు ఉన్నం వీరేందర్, వాంకుడోత్ జగన్, వివిధ పార్టీల నాయకులు నున్న నాగేశ్వరరావు, సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు పి.సోమయ్య, మాజీ ఎంపీపీ బానోత్ దేవులా నాయక్, ముత్యాల వెంకటఅప్పారావు, కొండబోయిన నాగేశ్వరరావు, కే.నరేంద్ర, కోటి అప్పారావు, అడ్డగోడ ఐలయ్య, దారావత్ మంగీలాల్, హనుమకొండ రమేష్, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, అభిమానులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదరించండి... గెలిపించండి ప్రజాసేవలో అభివృద్ధి చేస్తాను





- **15వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ గా దూది పాళ్ల రాంబాబు**

**సత్తుపల్లి జనవరి31(ప్రజా జ్యోతి)** మున్సిపాలిటీ ఎలక్షన్ నామినేషన్ పూర్తి కావడంతో 15వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ గా దూదిపాళ్ల రాంబాబు ప్రచారంలో జోరుగా కొనసాగుతున్నారు. గత ఐదు సంవత్సరాలు ప్రజా సేవలో ముందు ఉంటూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఎన్నో సేవలు చేశానని ఈసారి కూడా వార్డు ప్రజలు ఆదరించి అభిమానిస్తే గెలుపు దిశలో ముందు ఉండి కచ్చితంగా అభివృద్ధి దిశలోగా వార్డును తీసుకొస్తానని, ప్రతి ఒక్కరు నాకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రచారం ప్రారంభించారు. స్థానిక శాసన సభ్యురాలు డాక్టర్ మాట్టా రాగమయి దయానంద్ నాపై నమ్మకంతో ఉంచి,కౌన్సిలర్ అభ్యర్థిగా ఎన్నుకున్నందుకు ప్రజలకు మరింత సేవలు చేసి మంచి పేరు తెచ్చుకుంటానని తెలిపారు. గతంలో కౌన్సిలర్ గా చేసిన సమయంలో ప్రతి ఒక్కరికి సమస్య లేకుండా తీర్చిదిద్దానని, అన్ని వేళలా అందుబాటులో ఉంటూ తన మన భేదం లేకుండా వార్డు ప్రజలందరికీ సేవలు చేశానని, మళ్లీ ప్రజా సేవ చేసేందుకు ముందుకు వచ్చానని,మీరంతా ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.

## కాలువ లోకి దూసుకెళ్లిన స్కూటీ

- **తల్లి, కూతురు కు తీవ్ర గాయాలు**



**నేలకొండపల్లి, జనవరి 31 ప్రజా జ్యోతి:**కోదాడ–ఖమ్మం హైవే సర్వీస్ రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు పంట కాలువ లోకి పల్టీకొడుతూ దూసుకెళ్లింది. దీంతో తల్లి, కూతురు కు తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రం లో చోటు చేసుకుంది....స్థానికుల కథనం ప్రకారం వివరాలు,ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండల కేంద్రం కు చెందిన తల్లి, కూతురు శనివారం స్కూటీ పై హైవే పక్కన సర్వీస్ రోడ్డు న బోదులబండ వైపు వెళ్తున్నారు. వెనక నుంచి లారీ వస్తుండుగా... పక్కకు జరిగే క్రమంలో స్కూటీ అదుపు తప్పి... డ్రైనేజీ లేకపోవటంతో కాలువ లోకి దూసుకెళ్లింది. సిమెంట్ ర్యాంపు కావటంతో పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురు కు తీవ్ర గాయాలైయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి కాలువ లోకి దిగి క్షతగాత్రులను. స్కూటీ ని బయటకు తీశారు. ఇరువురును స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో ప్రధమ చికిత్స చేయించారు.

## ముగిసిన సీఎం కఫ్ క్రీడలు



**నేలకొండపల్లి, జనవరి 31 ప్రజా జ్యోతి :**మండలం లోని బోదులబండ లో నిర్వహించిన సీఎం కఫ్ మండల స్థాయి పోటీలు శనివారం విజయవంతంగా ముగిశాయి. 30, 31 రెండు రోజల పాటు నిర్వహించిన పోటీలకు విశేష స్పందన లభించింది. మొత్తం 6 కస్టర్ల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాలలో జరిగిన పోటీ రసవత్తరంగా జరిగాయి. విద్యార్థులకు రెండు రోజుల పాటు పెందుర్తి మధుసూదన్రావు మెమోరియల్ ట్రస్టు వారు భోజన వసతి తో పాటు, బహుమతులు ప్రధానం చేశారు. దాదాపు రూ.65 వేల ను క్రీడల నిర్వహణ కు అందించి దాతృత్వం ను చాటుకున్నారు. మండల స్థాయిలో ప్రతిభచూపిన క్రీడాకారులను గుర్తించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు, సర్పంచ్ కట్టెకోల నాగార్జున్రావు, క్రీడల నిర్వహాణ ఆర్గనైజర్ కార్యదర్శి డి.రామకృష్ణ, హెచ్ఎం. నిర్మలాకుమారి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కోడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## యస్.బి.ఐ.టి. ని సందర్శించిన బహుళజాతి ఐ.టి. సంస్థ వర్చుసా





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :**ప్రముఖ అంతర్జాతీయ ఐ.టి. రంగ సంస్థ వర్చుసా హెచ్.ఆర్. తమ కళాశాలను సందర్శించినట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శనివారం కళాశాలలోని చివరి సంవత్సరం విద్యార్థులకు "క్యాంపస్ టు కార్పోరేట్" కార్యక్రమంలో భాగంగా వర్చుసా సీనియర్ హెచ్.ఆర్ అభిషేక్ ద్వారా గెస్ట్ లెక్టర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్పోరేట్ రంగానికి అవసరమైన మెళకువలు, విద్యార్థులకు అవసరమైన ఏ.ఐ.నైపుణ్యాలు,వ్యక్తిగత క్రమశిక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.అమెరికా కేంద్రంగా ఐటి సేవలు అందిస్తున్న వర్చునా కంపెనీ తమ కళాశాలను ఎంపిక చేసి తమ విద్యార్థులతో ముచ్చటించడం, భవిష్యత్ కార్యచరణపై ఒక అవగాహనకు రావటం హర్షించదగ్గ విషయమని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా జి. ధాత్రి తెలిపారు. విద్యార్థులు తాము చేసిన ప్రాజెక్టుపై పూర్తి అవగాహనా కలిగి ఉండాలని,కోడింగ్ కాంటెస్ట్లు అయిన హ్యాకథాన్, ఐడియాథాన్ వంటి పోటీలలో చురుకుగా పాల్గొనాలని టెక్నికల్ స్కిల్స్ పై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేసినట్లు కళాశాల వైస్ చైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. సదస్సులో భాగంగా విద్యార్థులు లేవనెత్తిన ప్రశ్నలు,అనుమానాలను హెచ్.ఆర్.అభిషేక్ నివృత్తి చేసినట్లు తెలిపారు.మైక్రోసాఫ్ట్,గూగుల్,అడోబ్, సేల్స్ ఫోర్స్, పెగా వంటి అంతర్జాతీయ సంస్థలు క్లైంట్స్ గా కలిగి ఉన్న వర్చుసా సంస్థలో రాసున్న రోజులలో ఇంటర్న్షిప్స్, వర్క్షాప్స్, ప్లేస్మెంట్స్ తదితర అంశాలపై అవగాహన కలిగిందని కళాశాల ప్రిన్సిపల్ డా జి. రాజ్ కుమార్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో తమ కళాశాల తమదైన ముద్రను కలిగిఉండేలా ప్రణాళికలను సిద్ధంచేసినట్లు, భవిష్యత్తులో మరిన్ని బహుళజాతి సంస్థలను తమ కళాశాలకు ఆహ్వానించడంతో పాటు తమ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించనున్నట్లు ధీమా వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా కంపెనీ సీనియర్ హెచ్.ఆర్. అభిషేక్ ను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు.ఈ కార్యక్రమంలో వర్చుసా సీనియర్ హెచ్.ఆర్.డి. అభిషేక్,కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, ఇన్నోవేషన్ భాధ్యులు డా యమ్. మురళీ మోహన్, వివిధ విభాగాల హెచ్.ఒడీలు,టి.పి.ఐ.యస్. సవిత,కోఆర్డినేటర్ డా బి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## లింగం బంజరలోని శివాలయ భూముల సర్వే

- **ఈవో వేణుగోపాలాచార్యులు**





**కారేపల్లి, జనవరి 31 ప్రజా జ్యోతి :** దేవాదాయ భూముల పరిరక్షణ మనందరి బాధ్యత అని, ఎవరైనా దేవాదాయ భూములు ఆక్రమిస్తే సహించేది దేవదయా శా ఖ ఈవో కొండకింది వేణుగోపాలాచార్యులు అన్నారు. శనివారం సింగరేణి మండలం విశ్వనాథపల్లి గ్రామపంచాయతీ శివారు లింగం బంజర గ్రామంలో కొలువుతీరిన వందేళ్ల చరిత్ర ఉన్న పురాతన శివాలయం(శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం) కు చెందిన దేవాదాయ భూమి సర్వే నెంబర్ 362 లో 3.08 ఎకరాల భూమి హద్దులు నిర్ణయించేందుకు ..గ్రామస్తుల సమక్షంలో ఈవో వేణుగోపాలాచార్యులు సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 362 సర్వే నెంబర్లో మొత్తంగా 11.33 ఎకరాలు విస్తీర్ణం ఉందని , దీనిలో 3.08 ఎకరాలు దేవాలయం కు సంబంధించిన దేవాదాయ భూమి పాత పహాని ప్రకారం ఉందన్నారు. దేవాలయం, దేవాలయ ప్రాంగణం వరకు ప్రస్తుతం 10 గుంటలు మాత్రమే ఉందని, మిగతా భూమిని సర్వే ద్వారా గుర్తించి హద్దులు నిర్ణయిస్తామని , దీనికి గ్రామస్తుల సహకారంతోపాటు హద్దుల్లో ఉన్న రైతుల సహకారం కావాలని ఆయన కోరారు. దీనికి సంబంధించి 362 సర్వే నెంబర్లో ఉన్న 11.33 ఎకరాలకు సంబంధించిన రైతులందరికీ సర్వే నిమిత్తం నోటీసులు అందజేయడంతో పాటు, గ్రామంలో టమకా వేసి సామరస్యంగా సర్వే చేపడతామని అన్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా సర్వే అధికారుల సూచనల మేరకు హద్దులు నిర్ణయించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ వి. కిరణ్ కుమార్, జిపిఓ బి. రాందాస్, గ్రామ పెద్దలు పొదిలి గిరి సురపురెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, పురం అంజయ్య, రేళ్ళ సత్యనారాయణ, పురం గోవర్ధన్, బడుగుల శ్రీను, మొగిలిచర్ల రాంబాబు, మల్లికార్జునరావు, పురం శంకర్ ,బొమ్మల కృష్ణ పాల్గొన్నారు.

## మండలంలో ముగిసిన సీఎం కప్ ఆటల పోటీలు

**కారేపల్లి, జనవరి 31, ప్రజా జ్యోతి:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామస్థాయిలలో ఉన్నటువంటి క్రీడాకారులను గుర్తించి చైతన్యవంతం చేయాలని భావంతో రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం, శనివారం మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. అందులో భాగంగా సింగరేణి మండలంలో ఎంపీడీవో, ఎంఈఓ ల ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కారేపల్లి హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో బాల, బాలికలకు కబడ్డీ, కోకో, వాలీబాల్, పరుగు పందాలు నిర్వహించారు. ఈ ఆటలలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ రెండు రోజులు నిర్వహించిన ఆటలలో గెలుపొందిన వారికి శనివారం మండల అధికారుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు త్వరలో నియోజకవర్గస్థాయిలో జరుగు ఆటల పోటీలలో పాల్గొనాలని మండల అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి. శ్రీనివాస్ ఎంఈఓ డి. ఏసుదాస్, ఎమ్మార్వో, ఏ. రమేష్, ఎస్ ఐ బైరి గోపి, పిఇ టిలు, క్రీడాకారులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రచారంలో దూసుకెళ్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని కొట్టైం శిరీష రంజిత్ రెడ్డి



**ఖమ్మం రూరల్ జనవరి 31 (ప్రజా జ్యోతి ప్రతినిధి):** ఎదులాపురం మున్సిపాలిటీ ఎన్నికలలో 30 వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని కొట్టైం శిరీష రంజిత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారంలో గడపగడపకు కాంగ్రెస్ నినాదంతో ప్రచారంలో ఊరెత్తిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పరిపాలనలో చేపడుతున్న సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరికి వివరిస్తూ అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ ఓటెయ్యాలని ఎదులాపురం మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నెంబర్ వన్ స్థానంలో రాష్ట్రంలోనే రోల్ మోడల్ గా చేస్తానని అభయమిచ్చిన రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో 30 వ వార్డు ను అభివృద్ధివైపు సంక్షేమ వైపు నడిపిస్తానని వారు అభయమిచ్చారు. వార్డు లోని ఓటర్లందరూ కాంగ్రెస్ పార్టీకే తమ యొక్క మద్దతును తెలియజేస్తున్నారని జోరుగా హుషారుగా వందలాది మంది కార్యకర్తలు విస్తృత ప్రచారం చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం నల్లేరు మీద నడకేనని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు భూక్య సురేష్ నాయక్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వేంసూర్ మండలంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి పర్యటన





**వేంసూర్ జనవరి 31 ప్రజా జ్యోతి:** వేంసూరు మండలంలో పలు గ్రామాల్లో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి పర్యటించారు. పలు గ్రామాల్లో తన సన్నిహితులు కార్యకర్తలు మరియు నాయకులను కలుసుకొన్నారు వేం సురు మర్లపాడు దుద్దెపూడి అడసర్లపాడు భరణిపాడు వెంకటాపురం పలు గ్రామాల్లో పర్యటించారు. పిడమర్తి మాట్లాడుతూ వేంసూర్ మండలంతో తనకు చాలా అనుబంధ ఉందని అనేక గ్రామాల్లో తన సన్నిహితులు ఉద్యమకారుల నాయకులు తనతో కలిసి పని చేశారని వారిని చూడటం ఆనందంగా ఉందని ఇక్కడకు రావటం అంటే తనకు చాలా ఇష్టమని చెప్పారు.

## వైరా పురం పోరులో.. నామినేషన్ లు వేసిన అందరు ఉన్నారు




**ఖమ్మం వైరా జనవరి 31 ప్రజా జ్యోతి :** వైరా పురపాలక పోరులో నామినేషన్ వేసిన అభ్యర్థులందరూ ఉన్నారు. 3 రోజులపాటు జరిగిన నామినేషన్ ప్రక్రియలో 20 వార్డులకు గాను 190 నామినేషన్లు వచ్చాయి. శనివారం పురపాలక నోడల్ అధికారి దీక్ష రైనా పర్యవేక్షణలో అధికారులు స్క్రూట్ ని నిర్వహించారు. అయితే అందరు నామినేషన్లు నిబంధనలకు లోబడి ఉండటంతో ఒక్క నామినేషన్ కూడా రిజెక్ట్ కాలేదు. ఈనెల 3 వరకు విత్ డ్రాలకి సమయం ఉంది. అనంతరం రాజకీయ ప్రత్యర్థుల ప్రచార పోరు హోరెత్తనుంది.

# ఇరుముడలతో తిరుపతమ్మ గుడికి బయలుదేరిన స్వాములు

- **41 రోజుల దీక్షల అనంతరం ఇరుముడులతో పెనుగంచిప్రోలు**



**తిరుమలాయపాలెం జనవరి 31 (ప్రజా జ్యోతి )**

పిండిప్రోలు గ్రామంలో కొలువైన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో తిరుపతమ్మ తల్లి నామస్మరణతో భక్తి వాతావరణం నెలకొంది. గత 41 రోజుల పాటు నిష్టగా వ్రతదీక్షలు చేపట్టి పూజలు అందుకున్న తిరుపతమ్మ తల్లి ఆశీస్సులతో స్వాములు శనివారం ఇరుముడులు ధరించి పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయానికి బయలుదేరారు. స్వాములు ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఇరుముడులను శిరస్సుపై ధరించిన స్వాములు గోవిందా.. గోవిందా.. అనే నామస్మరణతో పెనుగంచిప్రోలుకు బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామమంతా భక్తి పరవశంతో నిండిపోయింది.స్వాములను సాగనంపేందుకు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మహిళలు హారతులు ఇచ్చి, కొబ్బరికాయలు కొట్టి శుభాకాంక్షలు తెలిపారు. యువకులు భజనలతో, కీర్తనలతో యాత్రకు మరింత శోభనిచ్చారు. సంప్రదాయ వేషధారణతో, నియమ నిష్టలతో సాగిన పూజలు గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది.41 రోజులపాటు ఉపవాసాలు, నియమాలు పాటిస్తూ స్వాములు తిరుపతమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారని భక్తులు తెలిపారు. తమ కుటుంబాల్లో సుఖసంతోషాలు, గ్రామంలో శాంతి సమృద్ధి నెలకొనాలని తల్లి ఆశీస్సులు కోరుకున్నారు.. అనంతరం గ్రామ పెద్దలు మాట్లాడుతూ..ప్రతి సంవత్సరం సంప్రదాయంగా నిర్వహించే తిరుపతమ్మ తల్లి మాలలు భక్తుల ఐక్యతకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. తిరుపతమ్మ తల్లి కృపతో స్వాముల 41 రోజులపాటు పూజలు చేసిన భక్తులు సురక్షితంగా తిరిగి రావాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గురుస్వామి జాల,రవి ,గోకినపల్లి నరేష్ స్వామి, పసలాది నరేష్ స్వామి పరికపల్లి నరేష్ స్వామి అంగిరేకుల శ్రీకాంత్ చామకూర్తి ప్రశాంత్ రేపాకుల దీక్షిత అయితన బోయిన ప్రవీణ్ స్వామి, కన్నె స్వాములు కత్తి స్వాములు గంట స్వాములు గత స్వాములు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇద్దరు సైబర్ నేరస్తులను అరెస్టు చేసిన ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి:** ఆన్లైన్లో ట్రేడింగ్, ఇన్వెస్ట్మెంట్ లోడబ్బులు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి,సుమారు 18 లక్షల రూపాయలు మోసం చేసిన కేసులలో ఇద్దరిని ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు ఆంధ్రప్రదేశ్ రాష్టం లోని వైజాగ్ సిటీ లో అరెస్టు చేసినట్లు పోలీస్ కమిషనర్ సునిల్ దత్ తెలిపారు. కేసు వివరాలలోకి వెళితే ఖమ్మం జిల్లాకు చెందిన ప్రైవేట్ ఉద్యోగికి వాట్సాప్ లో పరిచయమై ఆన్లైన్ లో ట్రేడింగ్,ఇన్వెస్ట్మెంట్ చేస్తే అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి వాట్సప్ ట్రేడింగ్ లింకుల ద్వారా సుమారు 18 లక్షలు రూపాయలు ఇన్వెస్ట్మెంట్ చేసి మోసపోయిన కేసులో గాను 1,80,000 రూపాయిలు అక్కౌంట్ కి వెళ్ళిన అక్కౌంట్ హోల్డర్ అయిన ఉమా శంకర్ 35 సం,హేమలత 35 సం,లను , వైజాగ్ లో అరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు.సైబర్ క్రైమ్ డి.ఎస్పీ,ఫణిందర్, ఇన్స్పెక్టర్ నరేశ్ , ఎస్సె లు రంజిత్ కుమార్ ,విజయకుమార్,కానిస్టేబుల్స్ భాను మూర్తి , కిషన్ రావు ,కృష్ణ ప్రసాద్ ,అఫ్సనా పోలీస్ కమిషనర్ అభినందించారు.

## మీ వాడిని మీ ఇంటి వాడిని ఆశీర్వదించండి

- **28వ వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నూకల రామ్మోహన్ రెడ్డి**



**ఖమ్మం రూరల్ ప్రజాజ్యోతి :** ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికలలో 28 వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నూకల రామ్మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారంలో గడపగడపకు కాంగ్రెస్ నినాదంతో ప్రచారంలో ఊరెత్తిస్తున్నారు మీ వాడిని మీ ఇంటి వాడిని నన్ను ఆశీర్వదించండి అంటూ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పరిపాలనలో చేపడుతున్న సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరికి వివరిస్తూ అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ ఓటెయ్యాలని ఎదులాపురం మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నెంబర్ వన్ స్థానంలో రాష్ట్రంలోనే రోల్ మోడల్ గా చేస్తానని అభయమిచ్చిన రెవెన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో 28వ వార్డు ను అభివృద్ధివైపు సంక్షేమ వైపు నడిపిస్తానని వారు అభయమిచ్చారు. వార్డు లోని ఓటర్లందరూ కాంగ్రెస్ పార్టీకే తమ యొక్క మద్దతును తెలియజేస్తున్నారని జోరుగా హుషారుగా వందలాది మంది కార్యకర్తలు విస్తృత ప్రచారం చేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భూక్య సురేష్ నాయక్ మంగీలాల్ బొడ్డు బొందయ్య సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జిడిపి పల్లిలో పశు గర్భకోశ వ్యాధి నివారణ శిబిరం విజయవంతం



**కల్లూరు, జనవరి 31 ప్రజా జ్యోతి:** పశుగణాభివృద్ధి మరియు పశువర్ధక శాఖ ఏడి రూపు కుమార్ ఆధ్వర్యంలో కల్లూరు మండలం జిడిపి పల్లి గ్రామంలో పశు గర్భకోశ వ్యాధి నివారణ శిబిరం నిర్వహించారు. ఆయన గ్రామంలోని రైతులకు పశువుల గర్భకోశ వ్యాధుల పట్ల పలు సూచనలు తెలిపారు. పాడి రైతులు తమ పశువులను ఈనిన మూడు నెలల్లో చూడు కట్టించాలని, చూడు కట్టించిన మూడు నెలల తర్వాత పశువు గర్భ నిర్ధారణ గోపాలమిత్రుల ద్వారా చేసుకోవాలని సూచించారు. పాడి పశువుల సరియైన యాజమాన్యం నిర్వహణ లోపం కారణంగా పశువులు తిరిగి తిరిగి కట్టుటకు వస్తున్నాయని, రైతులు పశువులకు ఎండు గడ్డి, పచ్చి రొట్టతో సహ దాన రూపంలో పోషకాలు అందించడం ద్వారా పశువులు బలంగా ఉండి కట్టు నిలుస్తుందని అన్నారు. శిబిరంలో 25 గేదెలకు, 15 దూడలకు నత్తల ఇంజక్షన్స్, పేల నివారణకు ఇంజక్షన్స్ వేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మమత, సూపర్వైజర్ లక్ష్మణ్, గోపాల మిత్రాలు బి రవి, విజయ్ కుమార్, అప్పారావు, ప్రసాద్, పాడి రైతులు పాల్గొన్నారు.

## మధిర మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి



**మధిర ప్రజా జ్యోతి:** పట్టణంలో 17 వ డివిజన్ నందు తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు మదిర మున్సిపాలిటీ ఎన్నికల్లో 17 వ వార్డ్ లో ఎర్రుపాలెం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి ప్రచార కార్యక్రమంలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి హస్తం గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీ తో గెలిపించి మధిర అభివృద్ధిని మరింత ముందుకు తీసుకుపోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలోడివిజన్ ఇంచార్జ్ లు పులిబండ్ల చిట్టిబాబు, నెల్లూరి రవి కుమార్, 17వ డివిజన్ నాయకులు తలుపులు వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గూడేటి బాబురావు, యూత్ కాంగ్రెస్ నాయకులు దేవరకొండ రాజీవ్ గాంధీ, SC సెల్ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# అవినీతికి కేరాఫ్ అడ్రస్ బిఆర్ఎస్ పార్టీ

- ఒక మహిళ రాజకీయంగా ఎదగటం చూడలేకనే నందిని విక్రమార్క గారి పై ఆరోపణలు చేస్తున్న తాతా మధు
- కాంగ్రెస్ పార్టీ ఎవరినీ భయపెట్టాల్సిన అవసరం కానీ డబ్బు పెట్టి కొనవలసిన అవసరం కానీ లేదు
- మధిర మండల కాంగ్రెస్ అధ్యక్షులు సురంశెట్టి కిషోర్



**మధిర ప్రజా జ్యోతి:** మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరం శెట్టి కిషోర్ మాట్లాడుతూ అవినీతి కమిషన్లకు కేరాఫ్ అడ్రస్ బిఆర్ఎస్ పార్టీ అని ఈ విషయాన్ని స్వయంగా మీ అధినాయకుడు కుమార్తె పత్రికాముఖంగా ప్రకటించిన విషయం తాతా మధు గారికి గుర్తు లేదా అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక విద్యుత్ శాఖ మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క మల్లు నందిని విక్రమార్క పై మాట్లాడే స్థాయి తాత మధు కు కానీ బిఆర్ఎస్ పార్టీ నాయకులకు కానీ లేదు అన్నారు.. రాష్ట్రంలో మీ 10 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వకుండా అణచివేశారని మహిళలంటే చులకన భావన బిఆర్ఎస్ పార్టీలో ఉందని మధిర ప్రాంతం నుంచి ఒక మహిళ రాజకీయ ఎదుగుదల చూడలేకనే నిందారోపణలు చేస్తున్నారని అన్నారు. మధిర మున్సిపాలిటీ అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని తెలిసి బిఆర్ఎస్ పార్టీ నుంచి కౌన్సిలర్ పదవికి పోటీ చేయడానికి భయపడుతూ తప్పుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీ ఎవరినీ భయపెట్టాల్సిన అవసరం కానీ డబ్బు పెట్టి కొనవలసిన అవసరం కానీ లేదని అన్నారు. పది సంవత్సరాలు మున్సిపాలిటీలో ఒక్క పని కూడా చేయకుండా నిధులను పక్కదారి మళ్లించిన బిఆర్ఎస్ పార్టీ ఆనాడు మధిర మున్సిపాలిటీ అభివృద్ధి చేసి ఉంటే ఈరోజు మధిర మున్సిపాలిటీ ఇంత దీనస్థితిలో ఉండేది కాదు అన్నారు. మధిరలో బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి చేసింది ఏమీ లేదని వారు చెప్పుకుంటున్న అభివృద్ధి పథకాలు అన్ని ఎమ్మెల్యే గా, ప్రతి పక్షనాయకుడు గా మల్లు భట్టి విక్రమార్క గారు తీసుకొచ్చినవేనని అన్నారు. ఈనాడు ఏ మొహం పెట్టుకుని మధిర మున్సిపాలిటీలో ఓటు అడుగుతున్నారని ప్రశ్నించారు.. మధిరలో ఓటు అడిగే హక్కు ఒక్క కాంగ్రెస్ పార్టీకే ఉందని మధిర అభివృద్ధి మల్లు భట్టి విక్రమార్క తోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని మధిరను అభివృద్ధి చేయగల దమ్మున్న నాయకుడు మల్లు భట్టి విక్రమార్క అని ఆయన అన్నారు.ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చావా వేణు మండల బీసీ సెల్ అధ్యక్షుడు చిలువేరు బుచ్చిరామయ్య మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాణావత్ వెంకటరమణ నాయక్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, పులిబండ్ల చిట్టిబాబు, పత్తేపరపు సంగయ్య, ఆవుల కిరణ్ పట్టణ కాంగ్రెస్ నాయకులు సువర్ణ కంటి రామకృష్ణ, మైలవరపు చక్రి, షేక్ గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## మధిర ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో "ప్రజా జ్యోతి" నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

- ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు జీవి అరుణ్



**మధిర ప్రజా జ్యోతి :** మధిర ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజా జ్యోతి తెలుగు జాతీయ దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న GV అరుణ్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ, ప్రజా జ్యోతి దినపత్రికలో ఆర్సి ఇన్చార్జిగా పనిచేస్తున్న కృష్ణ ఎన్నో ప్రజా సమస్యలను వెలికి తీసి అధికారుల నుండి పరిష్కార మార్గాలను చూపించడంలో సఫలీకృతమయ్యారని కొనియాడారు.నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వార్తలు రాస్తున్న కృష్ణకు ప్రెస్ క్లబ్ సభ్యులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు వంగర గోపి, ఉప కోశాధికారి ఎడవల్లి శ్రీధర్ , పి టివి విజయ్ రాజు,సహాయ కార్యదర్శి వాసు, ప్రెస్ క్లబ్ సభ్యులు వేల్పుల పవన్ కళ్యాణ్, దోర్నాల సంతోష్, ఎన్ విజయభాస్కర్, కోటి,తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ఇరుముడి మహోత్సవం

- అమ్మ శరణం తిరుపతమ్మ శరణం అంటూ ఇరుముడి మహోత్సవం





**నేలకొండపల్లి, జనవరి 31 ప్రజా జ్యోతి :** మండల కేంద్రంలోని నాచేపల్లి గ్రామంలో శనివారం తిరుపతమ్మ, గోపయ్య స్వామి మాల ధారణ స్వాములు, ఇరుముడి కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురు స్వామి నెహ్రూ గురుస్వామి, గిరి గురుస్వామి, ఆధ్వర్యంలో ఇరుముడి కార్యక్రమం ను నిర్వహించారు. 41 రోజులపాటు నీయమ్మ నిష్ఠలతో ప్రత్యేక పూజలు చేసి దీక్షను పూర్తి చేశారు. అమ్మవారి సన్నిధి పెనుగంచిప్రోలు బయలుదేరారు. ఈ సందర్భంగా భక్తులు, ఆటపాటలకు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధరావత్ మౌనిక, ( నాగేశ్వరరావు ) బానోత్ నెహ్రూ స్వామి, నరేష్ స్వామి, నాగేశ్వరరావు, భార్గవ్, నాగరాజు, బజార్, మహేష్, పుల్లయ్య, నగేష్, మహేష్, శేఖర్, గోపి, అంజి, వినోద్, శివ, గణేష్, సైదులు,సాయి, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఆర్కే ఫౌండేషన్

- ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి పాదాలచెంత ప్రముఖుల సమక్షంలో అవార్డు ప్రధానం
- రామకృష్ణను అభినందించిన ప్రముఖులు



**మధిర ప్రజా జ్యోతి :** పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు.ఆర్కే ఫౌండేషన్ రెస్క్యూ టీం ,ఆర్కే ఫౌండేషన్ అనాధ ఆశ్రమ నిర్వాహకుడు. ఎంతోమందిఅనాధలకు అభాగ్యులకు అంత్యక్రియలు నిర్వహిస్తూ ఎంతో మంది క్షతగాత్రులకు ప్రాణం పోస్తూ.. నిత్యం ప్రజ సేవ చేస్తూ, ఎన్నో మూగ జీవాలకు ఊపిరి పోసిన. డాక్టర్ దోర్నాల రామకృష్ణకు జాతీయ ఉత్తమ సేవా పురస్కారాన్ని శ్రీపతి చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో తిరుపతి శాసనసభ్యులు శ్రీఆరణి శ్రీనివాసులుగారు మరియు తిరుమలతిరుపతి దేవస్థానం బోర్డుసభ్యులు భాను ప్రకాష్ గార్ల సమక్షంలో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో అంగరంగ వైభవంగా అవార్డును ఆర్కే ఫౌండేషన్ వారికి అందజేశారు.కార్యక్రమంలో ఆల్ ఇండియా ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు కె.వి.ఆర్ ఫౌండేషన్ ఫౌండర్ శ్రీ కొడవటిగంటి బాలరాజు మరియు రెండు తెలుగురాష్ట్రాల సామాజిక సేవకులు ఆధ్యాత్మికవేత్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జాతీయఉత్తమసేవ పురస్కారాన్ని అందుకున్నారు.

## కళలను రెండు తెలుగు రాష్ట్రాలకు విస్తరింపజేస్తున్న మధిర రంగస్థల కళాకారులకు అభినందనలు

- మధిర ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు GV అరుణ్



**మధిర ప్రజా జ్యోతి:** కళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మధిర ప్రాంతంలో రెండు రాష్ట్రాల స్థాయి సాంస్కృతిక, పౌరాణిక, ఏకపాత్రాభినయ, సాంఘిక నాటక పోటీలను నిర్వహిస్తున్న మధిర రంగస్థల కళాకారులను అభినందించిన మధిర ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు GV అరుణ్.శనివారం బంజారా కాలనీ వెంకటేశ్వర స్వామి కళ్యాణమండపంలో మాటూరు పేట శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ వ్యవస్థాపకులు గడ్డం సుబ్బారావు ఆధ్వర్యంలో తెలుగు రెండు రాష్ట్రాల స్థాయి ఏకపాత్రాభినయం, సన్నివేశాల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మధిర ప్రెస్ క్లబ్ అధ్యక్షులు GV మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలను ప్రోత్సహించేందుకు శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ వ్యవస్థాపకులు గడ్డం సుబ్బారావు చేస్తున్న కృషిని వారు ప్రశంసించారు. అంతేకాకుండా అంతరించిపోతున్న కళలను బ్రతికిస్తూ మధిర ప్రాంతం కళలకు పుట్టినిల్లు లా కాపాడుతూ రంగస్థల కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ ప్రాంతాల కళాకారులు ప్రదర్శించిన ఏకపాత్రాభినయం సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నాయి. పోటీల్లో పాల్గొన్న కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ శాఖ మాజీ చైర్మన్, రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షులు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, నిర్వాహకులు గడ్డం సుబ్బారావు, భద్రాచలం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ ఐలూరి వెంకటేశ్వర రెడ్డి భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకట రెడ్డి మధిర ప్రధాన ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులు నాళ్ల శ్రీనివాసరావు ప్రెస్ క్లబ్ ఉప కోశాధికారి శ్రీధర్ ప్రెస్ క్లబ్ సభ్యులు కృష్ణ ఫర్ తదితరులు పాల్గొన్నారు.